# ఆ ప్రకృతి ★

రచన:
శ్రీ సి. యం. రామకృష్ణారెడ్డి.

మేడమీది పైభాగంలో వాలు కుర్చీలో కూర్చుని శ్మశానంకేసి మౌనంగా చూస్తూ కూర్చున్నాడు తను. ఉన్నట్లుండి తన హృదయంలో ఏదో బాధ ఆరని జ్వాలలా రగులుకొంటుంది. కొఱివి దయ్యాలు కాబోలు శ్మశానం చుట్టూ, కళ్ళల్లో దివిటీలు కుచ్చుకొని నృత్యం చేస్తున్నట్లు అటూ ఇటూ తిరుగుతున్నాయి. అదే అధునికుడయితే శ్మశానంలో, రాత్రిసమయంలో, శవాల్లో నుంచి మండుతున్న భాస్వరాన్ని చూసి కొఱివి దయ్యాలని సనాతనుడు భ్రమపడేవాడని అంటాడు. చితి కాలిపోతుంటే ఎవ్వరో దానిప్రక్కగా చేతిలో కఱ్ఱ పుచ్చుక ఏదో ఆలోచిస్తూ నిల్చున్నట్లు మసక మసకగా కన్పిస్తుంది. చితిలో పేర్చిన కట్టెలు శవం కాలుతున్నప్పుడల్లా పెటపెటమని విరుచుక శబ్దం చేస్తాయి. చేతిలో వున్న కఱ్ఱలతో బాగా బాది శవాన్ని చితిపైన అదుపులోకి తెచ్చుకొంటారు శవాన్ని దహనం చేసేవాడు. మిణుగురు పురుగులు చీకటిని పారద్రోలాలని, చితి చుట్టూరా తిరుగుతూ వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి. ఆకాశంలో ఎవ్వరో పోయిన వస్తువుకోసం దివ్వెలు పట్టుక ఈ అర్ధరాత్రి అంతా గాలిస్తున్నారు. ఆ గాలింపుల గాలంలో తనకెలాంటి శిక్ష తగులుతుందేమో అన్న భయంతో ఒకమూల కట్టకట్టుక కూర్చున్నట్లున్న గాలి ఎటూ వీయడంలేదు. వాతావరణంలో స్తబ్ధత...

\+ \+ ×

శ్మశానంకేసి చూస్తూ కూర్చున్న తనకు చంద్రమ్మత్త జ్ఞప్తికి వచ్చేసరికి ఒక్కసారిగా ఆలోచనాస్రవంతిలో కూడుకపోయాడు తను - చంద్రమ్మత్త స్వయాన తన నాన్న చెల్లెలి కాబట్టి, తనకు రేణుకతో వివాహం కాకమునుపు చంద్రమ్మత్తవాళ్ళ ఇంటికి అప్పుడప్పుడు వెళ్తుండేవాడు. ముసలివాడయిన రమణయ్య మామకు బాగా ఆస్తి వుందని చిన్నతనంలోనే చంద్రమ్మత్తనిచ్చి అతనికి వివాహం చేశారు... చంద్రమ్మత్తా - రమణయ్య మామలకు 'డుడూ - జోడూ' కాదని ఊర్లో అందరూ అనుకొనేవారు. అసలు వాళ్ళిద్దరిలోనే ఎంతో తేడా - వాళ్ళిద్దరికీ లేక లేక కలిగిన సంతానమే రేణుక.

నేను కాలేజీలో చదువుతున్న రోజులవి. ఒకనాడు తనకు జబ్బుచేసిందని అందువల్ల రైలులో వస్తున్నానని, స్టేషన్‌కు రావలసిందని చంద్రమ్మత్తే టెలిగ్రాం పంపింది. అప్పటికి కొద్దికాలం ముందుగా అకస్మాత్తుగా మామయ్య చనిపోయాడు. రేణుకు అప్పటికి పదకొండేళ్ళుంటాయి. నేను స్టేషన్‌లోకి వెళ్ళేసరికి రైలు వచ్చి ఆగింది. ఒకటవ తరగతి పెట్టెలోనుంచి నిదానంగా దిగుతున్న చంద్రమ్మత్త నాకేసి చూసి చిఱునవ్వు నవ్వింది. నేను చిఱునవ్వు నవ్వుతూనే మౌనంగా చంద్రమ్మత్త ప్రక్కగా వెళ్ళి నిల్చున్నాను. చంద్రమ్మత్త ఎంతో మారిపోయింది. ఇంతకుమునుపు సన్నగా పీలగా వుండే చంద్రమ్మత్త ఇప్పుడు కొంచం లావెక్కి, బలంగా ఎంత అందంగా వుంది! భుజాలవద్ద గట్టిగా కరుచుకపోయిన స్లీవ్స్‌లేని ఎఱ్ఱటి బ్లౌస్ దానిమీద వొదులు వొదులుగా జారుతున్న తెల్లని సిల్కు చీర చెరగు ఆమెకు ఎంతో అందాన్నిస్తున్నాయి...

అద్దాల కిటికిగుండా అవతలి వేపున, చిఱు గాలులకు మెల్లగా కదలాడుతున్న చెఱువులోని నీళ్ళ అలలకేసి చూస్తూ నా ఎదురుగ్గా కూర్చుండిపోయింది చంద్రమ్మత్త. ఓవర్‌బ్రిడ్జిమీద ఎదురుగ్గా వస్తున్న వాహనాలను తప్పుకొంటూ మెల్లగా పోతుంది మేమున్న టాక్సీ. ఓవర్‌బ్రిడ్జి దగ్గర క్రిందికి దిగిన రిక్షావాలాలోనున్న ఆసామి బరువును ఆలోచించుకొంటూ బరువుగా రిక్షాను ముందుకు తీసుకపోతున్నాడు. బరువులు మోస్తున్న కూలీలు రోడ్డుప్రక్క ఎండకు కారుతున్న చెమటను చినిగిన చొక్కాలతో పదేపదే తుడుచుకొంటున్నారు. చంద్రమ్మత్త భుజాలవద్ద పల్చని శరీరంపై సన్నగా తిరిగిన 'కర్వ్' టాక్సీలోనికి పడుతున్న నీరెండలో వింతగా మెరిసిపోతుంది. రమణయ్య మామ మనసులో మెదిలేసరికి 'మామ! చాలా unexpected గా పోయాడత్తా' అన్నాను. కిటికీగుండా అవతలివేపు చూస్తున్న అత్త నాకేసి తిరిగి చూసి 'అవును. అంతా అలానే

(తరువాయి 24వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

అనుకొంటారు. పెళ్ళినాడు ఆయన్ను ఆయన వయసును తెలిపే ముఖంమీది ముడతలను చూచి ఆయన అట్టే కాలం బతకడనుకొన్నాను - ఆయన వెళ్తూ విడిచిన జ్ఞాపక చిహ్నం రేణుక'...అత్తమ్మ ముఖంలో రంగులు మార్చుకొంటూన్న మార్పులు చూస్తామనుకొనేసరికి, టాక్సీ ప్రక్కగా దూసుకపోయిన లారీ నీడ అత్తమ్మ ముఖంమీద పడి నాకో అవకాశాన్ని కలుగచేయలేదు. చంద్రమ్మత్త చేతిలో వున్న ఇంగ్లీషు మ్యాగజైన్ పుటలు తిప్పుతూ ఏదో ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. ఇప్పుడు చంద్రమ్మత్తనుగూర్చి మాటే రెండు మాటలు చెప్తాను. పట్టుదలకు మరో పేరు చంద్రమ్మత్త. తానే మనుకొంటే అది జరిగిందాకా కన్నుమూయని వ్యక్తిత్వం. రమణయ్య మామ తానుంటున్న గ్రామంలో పంచాయతీ అధ్యక్షుడు కావాలని రెండు మూడుసార్లు ప్రయత్నం చేసి విఫలుడయ్యాడు. తుదకు తన కాండిడేట్స్‌లో ఒక్కడు మెంబర్ కాలేకపోయ్యారు. రమణయ్యమామ చనిపోయిన తర్వాత చంద్రమ్మత్త ఆ పంచాయతికి పోటీచేసి అధ్యక్షురాలయింది. మెంబర్లంతా ఆడవాళ్ళే. ఆ సంవత్సరం ప్రభుత్వం ఆ గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా గుర్తించి బహుమానమిచ్చింది. తర్వాత రమణయ్య మామ కలలుగన్న పది యకరాల పొలాన్ని ద్రాక్ష తోటగా మార్చి అతని ఆశల్ని నెరవేర్చగలిగింది. అంతేకాక పట్టుదలతో ఎక్కడో 'హిప్నాటిజమ్' గూర్చి నేర్చుకవచ్చిందని అంటుంటారు. ఇదంతా కేవలం చంద్రమ్మత్త పట్టుదలనుగూర్చి తెల్పడం మాత్రమే.

నేను కాలేజి అయిన తర్వాత క్లబ్బులోకి వెళ్ళి ఇంటికి వచ్చేసరికి రోజూ మా బంగాళా ఎదురుగ్గావున్న పూలతోటలో కుర్చీలో కూర్చుని ఏదైనా ఇంగ్లీషు మ్యాగజైను చదువుతూ చంద్రమ్మత్త కన్పించేది. తర్వాత మేమిద్దరం కేరమ్స్‌బోర్డు ఆడి తర్వాత భోజనానికి వెళ్ళేవాళ్ళం. రోజూ ఉదయంవేళ డాక్టరు వద్దకు టాక్సీలో వెళ్ళి చంద్రమత్త తిరిగి వచ్చేది. తర్వాతి కాలం ఏవైనా పుస్తకాలు చదవడంలోనో, నాతో కాలక్షేపం చేయడంలోనో ప్రొద్దుపుచ్చేది. ఆమె విశ్రాంతికోసం ఎక్కువకాలం ఆమెతో ఏదైనా ఆట ఆడుతూ కాలం గడిపేవాన్ని - లేదా ఏదైనా షాపుక్కో - లేక పిక్చరుకో...

అప్పటి ఆమె జబ్బు ఏదో ఇప్పుడయితే జ్ఞప్తికి లేదు కానీ, మొత్తంమీద డాక్టరు శ్రద్ధవల్ల, మేం కుమ్మరించిన డబ్బువల్ల అత్తయ్య అప్పటి రోగం కొద్దికాలంలోనే నయమయింది. అయినా ఆమె విశ్రాంతికోసం ఎక్కడైనా చల్లని ప్రదేశాల్లో కొంతకాలం గడిపితే ఆమె ఆరోగ్యం తిరిగీ యధాస్థితికి వస్తుందని డాక్టరు సలహా ఇవ్వడంతో, నేను కాలేజికి సెలవుపెట్టి అత్తయ్య వెంట 'ఊటీ'కి వెళ్ళాను. అక్కడితో అత్తమ్మతో నా పరిచయం మరింత ఎక్కువైంది. ఊటీ పర్వత సానువుల్లో అందమైన కోలిఫల్ చెట్లవెనుక, గలగల పారే సెలయేర్ల ఇసుక తిన్నెల్లో అందమైన ఆమె శరీర లావణ్యాన్ని ఆస్వాదించి అనుభవించాను. అత్తయ్య నిర్లిప్తంగా చిఱునవ్వు నవ్వి నాతో ఏకీభవించింది. అక్కడే నే పొరబడ్డాను...అక్కడే నా కాలు జారి బెణికింది...ఇంతవరకూ దాన్ని యధాస్థితిలోకి తెచ్చుకోలేకున్నాను...

పరిస్థితుల ప్రభావంవల్ల, తల్లిదండ్రుల ప్రోద్బలంవల్ల, ధనాపేక్షవల్ల రేణుకను నేను కొలదికాలంలోనే వివాహం చేసుకొన్నాను. స్లీవ్స్‌లేని తెల్లటి బ్లౌజ్ మీద, తెల్లటి చీరె ధరించి, ఆకాశంలో స్వేచ్ఛగా తేలిపోయే తెల్లటి మబ్బుతునకల్లే, సుందరిలా నడచివచ్చే రేణుక, ముమ్మూర్తులా చంద్రమ్మత్త ప్రతిఫలించిన ప్రతిబింబంలా కన్పించేది. రేణుకనలా చూచినప్పుడల్లా నా మనస్సు కలుక్కుమనేది. చిగురుటాకులా కాలమనే గాలికి మెల్లగా అటూ ఇటూ వూగే రేణుక నేనొక చెద పురుగునని గుర్తిస్తే... రేణుకతో నేను కారులో ద్రాక్ష తోటలకేసి సాయంత్రంవేళ షైరుకు వెళ్తున్నప్పుడు, మా వెనుక 'పోర్టికో'వద్ద నిల్చుని చంద్రమ్మత్త నాకేసి చూసి విడిచే వేడి నిట్టూర్పులు శూలంలా నా వీపున గ్రుచ్చుకొనేవి ... అడకత్తెరలో పోకనా ... రేణుకివన్నీ ఏమీ తెలియవు. మహా వుంటే పదహారేళ్ళుంటాయి. అమాయక బాల. స్నిగ్ధ మోహన సౌందర్యమూర్తి...ఒకనాడు - మునిమాపువేళ ద్రాక్ష తోటనుండి నేను ఒంటరిగా ఇంటికి నడిచివస్తున్నప్పుడు జివ్విచెట్టు వెనుక పొదదగ్గిర నన్ను కాటువేయబోయిన నల్లత్రాచును గునపంతో అతి చాకచక్యంతో పొడిచి చంద్రమ్మత్త నన్ను రక్షించింది. అక్కడే చంద్ర

మ్మత్త మరీ నాకు దగ్గరయింది. అదే విషయాన్ని పాలేరు ద్వారా తెలుసుకొన్న రేణుకలో విష బీజాల్ని నాటింది. ఒకనాడు రేణుక నాతో ఈ విషయాన్ని ప్రస్తావించింది. నేను మౌనంగా బయటికేసి నడిచాను. రేణుకలో కోపం మరీ ఎక్కువైంది. అసలే కోపిష్టి. ఫ్లోర్ మీద ముక్కలు ముక్కలుగా పగిలిన ఫ్లవర్ వేజ్ నాకేసి చూసి వెక్కిరించింది. అయినా అప్పటినుంచీ చంద్రమ్మత్తను రోజుకొక్కసారి అయినా చూడలేకుండా వుండలేకపోతున్నాను...

శరీర స్వాస్థ్యంవల్ల పదిరోజులనుంచి సుస్తుగా పడుకొన్నాను. కావలసినవన్నీ వంటమనిషి అమర్చిపోయేది. క్రింద ఏం జరుగుతున్నదికూడా తెలియరావడంలేదు. అసలే కలత చెందిన మనస్సు...శ్మశానంలో మండుతున్న చితి, నా గుండెలో బాధల్ని రేపి ముల్లులా గుచ్చుకొంటుంది. కొద్దిసేపు కళ్ళు మూసుకొని, నిద్ర ఉపక్రమించబోయి, తలుపు కిర్రుమన్న చప్పుడయ్యేసరికి వెను దిరిగి చూశాను వంటమనిషేమోనని —...మసక వెలుతురులో, తలుపు దగ్గరగా నిల్చుని చంద్రమ్మత్త నాకేసి చూసి నవ్వుతుంది. చేతులు చాచి ఆహ్వానించాను. తెల్లటి దుస్తుల్లో మబ్బుకన్యలావున్న చంద్రమ్మత్త, శరదృతువులో వెన్నెల పోగులను ఏర్చి పేర్చినట్లున్న చంద్రమ్మత్త, పావురంలా వచ్చి నా వళ్ళో వాలిపోయింది, ఒకటి రెండు నిముషాలు...ఎంతో అనుభూతి ...మధురానుభూతి చిఱునవ్వుతో, నాకేసి చూసి బరువుగా నిట్టూర్చి చంద్రమ్మత్త నాదగ్గరనుంచి పిట్టగోడ దాకా వెళ్ళి నిచ్చెనగుండా దిగిపోయింది. మైకం వొక్కసారిగా వదిలేసరికి, ఆత్రంగా వెళ్ళి నిచ్చెన గుండా దొడ్లోకి చూశాను. ఎలుకలకోసం అటు ఇటు గాలిస్తున్న ఒక్క పిల్లితప్ప అక్కడ మరెవ్వరూ లేరు...


కొద్ది నిముషాలు గడిచిపోయింది. ఏమీ తోచక శ్మశానంకేసి చూస్తూ వరండాలో అటూ ఇటూ పచారు చేస్తున్నాను. పిట్టగోడమీదవున్న పూలకుండీలో, గుడ్డి వెన్నెల్లో ఓ పువ్వు పూసి, లోకం చీకటికేసి చూసి భయపడి ఆకుల చాటున అణుక్కుంది. ఏదో మూలుగు క్రిందనుంచి విన్పిస్తుంది మరీ మరీ దగ్గరగా - కొద్దిసేపు ఆ శబ్దంకేసి విన్నాను ఆత్రంగా-తర్వాత విన్పించలేదు.

# అంజలి

ఓ కథాంజలీ!
నా అంజలిదే గైకొనుమా,
నిన్నవరు సృష్టించినారు
వారికివే నా శతాంజలీ!
నెల, నెలా నీ రాకతో - నా
హృదయం - ఆనందంతో,
పులకిత మయ్యేనో కథాంజలీ!
అంద చందాల నీ ముఖ చిత్రం
తెనుగు తేటలలో నీ కథలన్నీ
పాఠకుల నుర్రూత లూగించె
నిన్నేమని పొగడగలనో, కథాంజలీ!!
నిను చూస్తుంటే - నా మది
భావావేశం చెంది, ఎన్నెన్నో
కల్పిత గాధ లూహించాలని - నా
మనసెంతో - వేగిరపడుచున్నది
అందుకు నీవే మార్గదర్శివి సుమా,
నా ప్రియ కథాంజలీ!
ఈనాటి శుభసమయలో
నా శుభాకాంక్షలందుకొనుమో!
నా ప్రియ కథాంజలీ!!!

— శ్రీ సి. ఎచ్. సోములింగం.

సిగరెట్ ముట్టించి శూన్యంలోకి పొగ వదిలాను. తిరిగీ మూలుగు ... గుండెల్ని పిండుతున్నట్లు ... మేడ మెట్లు నొక్కొక్కటే దిగి క్రిందికి వెళ్ళాను. దేవుని పటం ముందు వెలుగుతున్న క్రొవ్వొత్తి చివరి దశలో కొట్టుమిట్టాడుతుంది. మూలుగు ఎక్కడనుంచి వస్తున్నది సరిగా తెలియనందువల్ల సిగరెట్ లైట్ వెలుగులో



లన్నీ గాలించాను. తుదకు పడమటి భాగంలో వున్న గదికేసి వెళ్ళి సిగర్ లైట్ వెలుగులో గది మూలలన్నీ పరీక్షగా చూశాను. గదిలో ఉత్తరం మూల తెల్లని దుస్తుల్లో మోకాళ్ళమీద తల ఆర్చి ఎవ్వరో వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. సంస్కారం లేనట్లున్న శిరోజాలు వీపుమీద అంటుకపోయివున్నాయి, ఆకాశాన్ని మబ్బులు క్రమ్ముకొన్నట్లు - అలా వెక్కి వెక్కి ఈ అర్ధరాత్రి సమయంలో ఏడుస్తున్న దెవరు? చంద్రమ్మత్తా! ఎందుకూ! నా మనసు పరిపరి విధాల ఆలోచిస్తుంది. నాకేమైనా మతి భ్రమణమా! మరి అలా ఏడుస్తూ కూర్చున్న దెవ్వరు? రేణుకా! ఏమో!...దగ్గరగా వెళ్ళి మోకాళ్ళమీద నిల్చొని ఆమె తలయెత్తి చూశాను... రేణూ...కన్నీటితో తడిపిన చెంపలమీద శిరోజాలు ఉండలు ఉండలుగా చుట్టుకొన్నాయి. సిగరెట్ వెలుగులో పరీక్షగా చూశాను. నీరులో నుంచి ప్రవాహంలా ఉబికివస్తుంటే దీనంగా ఏదో ఆలోచిస్తూ ఎటో చూస్తున్న కళ్ళు...తల వొళ్ళో పెట్టుకొని ముంగురుల సరిచేస్తూ ఎందుకలా ఏడుస్తున్నావ్' అన్నాను రేణుని. గది నిండా నిశ్శబ్దం అప్పుడప్పుడు ఒక్క రేణు ఎక్కిళ్లు తప్ప...

'నేను పాపిని. కన్న తల్లిని పొట్టన పెట్టుకొన్నాను. తల్లి నిప్పులాంటిదాని తెలియక, పాలేర్లు చెప్పిన మాటలు నమ్మి ఆమెమీద పగ సాధించాను. తుదకు ఆమె ప్రాణాల్ని చేతులారా తీశాను ... ఆమె చితి శ్మశానంలో, ఇంకా మండుతూనే వుంది, కుమిలిన నా గుండెల్లో కణ కణ లాడే నిప్పులు చెరగుతూ... నేను పాపిని' రేణు ఇక మాట్లాడలేకపోయింది, వెక్కి వెక్కి ఏడుస్తూ, నాకేసి చూస్తూ...

ఏదో భయం, భరింపరాని అగ్నిజ్వాలలా నన్ను తరుముకొస్తుంది. ఏమిటి చంద్రమ్మత్త చనిపోయిందా! మరి మేడమీద వరండాలో ఇందాకా ఎవరి కౌగిలిలో నేను కాలం వెళ్ళబుచ్చి వచ్చాను. ఇంతవరకూ మేడ మీద వాలు కుర్చీలో కూర్చుని శశానంలో మండుతున్న చితికేసి చూస్తూ కూర్చున్నానే! ఎవ్వరిదా చితి? చంద్రమ్మత్త దయ్యమై తనతో మేడమీద గడిపిపోయిందా! చనిపోయినా తమ కోర్కెలు నెరవేర్పక పోయిందాకా మానవుని ఆత్మ ఆ పరిసరాల్లో తిరుగుతుందంటారే అది ఇలాంటిదేనా!...చితికిపోయిన నా శరీరాన్ని ఎవ్వరో గునపాలతో పొడుస్తున్నారు. కాలిన ఇనుప ముక్కలతో ఎవ్వరో నా వళ్ళంతా చీరేస్తున్నారు. వీణ తంతియలని బలంగా పీకినట్లు, నా శరీరంలోని నరాలను ఎవ్వరో అదృశ్య వ్యక్తి బలంగా పీకివేస్తున్నాడు. ఏమిటి...ఏమిటి! రేణుక వెలిగించిన జ్యోతి గిరగిరా తిరుగుతున్నట్లుంది. స్వాధీనం తప్పిన వొళ్ళు...కాలి కాలి బూడిదయిన కాష్టంలా సోఫామీద కుప్పగా కూలిపోయాను.

—o—

తల్లి: ఒరే! సత్యా నీకు ఎన్నిసార్లు చెప్పాలిరా కాళ్ళు కడుగుకొని లోపలికి రమ్మని?

కుమారుడు: ఇప్పుడేమమ్మా దానికివచ్చింది తొందర!

తల్లి: త్వరగా చెప్పురా వెధవా!

కుమారుడు: ఏమమ్మా లెక్కలు కూడ మరిచిపోయావా ఏమి ఇది 24వ సారిచెప్పటం ఏమి?

—కె. సుందరాచారి, తిరుపతి.

టి. సి: ఏది మీ టిక్కెట్?

ప్రయాణికుడు: లేదండి.

టి. సి. టిక్కెట్టు లేకుండా రెండవ క్లాసులో ఎందుకు ట్రావెల్ చేస్తున్నారు?

ప్రయాణికుడు: టికెట్ వుంటే గదండీ ఫలానా క్లాసు అని, అది లేకుంటే ఏ క్లాసులో ప్రయాణంచేస్తే మాత్రం ఏం? శిక్ష అన్నిటికీ ఒకటేగా?

—డి. రాధాభాయి - ఆత్మకూరు.

Edited and Published by A.N. Raghavachar, No, 32, Krishnappa Naick Tank St, Madras-1
Printed by R. Bakthavachalu Bharathamatha Press. No. 39, Anderson St, Madras-1